


వృథానికి అర్థం ఈ మయూరం

స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా... వ్యర్థాలకు అర్థం చెబుతూ తీర్చిదిద్దిన మయూరం ఆకృతి ఇది. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జీజీహెచ్ కూడలిలో రహదారి డివైడర్‌పై దీనిని కొలువుదీర్చారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్... కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి బుధవారం ప్రారంభించారు. మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

కృతజ్ఞతాభివందనం



మారిటైం బోర్డు, ఇరవై సూత్రాల అమలు కమిటీ, పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్లుగా నియమితులైన... దామచర్ల సత్య, లంకా దినకర్, నూకసాని బాలాజీలు ముఖ్యమంత్రి చంద్రబాబును అమరావతిలోని సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నామినేటెడ్ పదవులకు ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ పుష్ప గుచ్ఛం అందజేశారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

ఈనాడు ప్రకాశం
గురువారం 26 సెప్టెంబరు 2024 5

ఒక్కరే రండి... బల ప్రదర్శనలొద్దు!

▶ నేడు జనసేన గూటికి బాలినేని

న్యూస్‌టుడే – ఒంగోలు



మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి... గురువారం జనసేనలో చేరనున్నారు. బలప్రదర్శన చేసి, అనుచరగణంతో ఘనంగా చేరాలని ఆయన భావించినా... అందుకు జనసేన అధిష్ఠానం నిరాకరించింది. ర్యాలీకి అనుమతి కోరినా ప్రయోజనం లేకపోయింది. దీంతో బెట్టు చేసినా పార్టీ నిర్ణయంలో మార్పు లేకపోవటంతో మెట్టు దిగారు. నిరాడంబరంగా ఒక్కరే పార్టీలో చేరేందుకు సన్నద్ధమయ్యారు.

అనూహ్యంగా మారిన పరిస్థితులు...

వైకాపా అధిష్ఠానం తనపట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఇటీవలే ఆ పార్టీకి బాలినేని గుడ్‌బై చెప్పారు. ఈ నేపథ్యంలో జనసేనలో చేరికను ఘనంగా నిర్వహించాలని భావించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఒంగోలుకు రప్పించి.. బలప్రదర్శన నిర్వహించి, అనుచరగణంతో పార్టీలో చేరాలని తలచారు. ఇదే సమయంలో ఆయన చేరికను కూటమి పార్టీల నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. పార్టీ మారినా గత పాపాల నుంచి తప్పించుకోలేరని... ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే ఆయన పని ఆయన చేసుకుంటారని, ఎవరికి అన్యాయం జరిగినా తాను ప్రశ్నిస్తానని బాలినేని ప్రతిస్పందించడంతో జిల్లా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ నేపథ్యంలో పరిస్థితులు అనూహ్యంగా మారిపోయాయి.

పట్టుపట్టి... బెట్టు వీడి...

ఒంగోలులో సభ అవసరం లేదనీ, ఒక్కరే మంగళగిరి వచ్చి చేరాలని బాలినేనికి జనసేన అధిష్ఠానం కబురుపంపింది. నగరంలోనూ ప్రదర్శనలొద్దని స్పష్టం చేసింది. ఆయనతో పాటు ప్రముఖ వ్యాపారవేత్త కంది రవిశంకర్ కూడా పార్టీలో చేరతారని ప్రకటించింది. దీంతో మాజీమంత్రి చేరిక ప్రత్యేక కార్యక్రమం కాదన్నది స్పష్టమైంది. పార్టీ కీలక నాయకుడు వేములపాటి అజయ్‌కుమార్ బుధవారం ఒంగోలు వచ్చారు. ఆయనతో జరిపిన చర్చల్లోనూ ఇదే విషయం స్పష్టం చేయడంతో మాజీ మంత్రి శిబిరం డీలాపడింది. ఒకానొక దశలో చేరిక తాత్కాలికంగా వాయిదా పడిందన్న ప్రచారమూ సాగింది. కినుక వహించినా పరిస్థితిలో మార్పులేకపోవడంతో బాలినేని మెట్టు దిగకతప్పలేదు. తాను చేరాక మిగతా వారినీ పవన్‌కల్యాణ్ సమక్షంలోనే పార్టీలో చేరుస్తానని క్యాడర్‌తో ఆయన చెప్పినట్లు సమాచారం.

నగరంలో ఫ్లెక్సీల రగడ



ఇదిలా ఉండగా ఒంగోలులో ఫ్లెక్సీల రగడ రాజుకుంది. జనసేనలో చేరిక సందర్భంగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వ్యాపారవేత్త కంది రవిశంకర్ ఒంగోలులో వేర్వేరుగా భారీస్థాయిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల ఈ ఫ్లెక్సీల్లోని బాలినేని బొమ్మలను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించారు. రవిశంకర్ బ్యానర్ల జోలికి వెళ్లలేదు. బాలినేని వేసిన ఫ్లెక్సీల్లోనూ పవన్ కల్యాణ్ బొమ్మల జోలికిపోలేదు. కేవలం బాలినేని బొమ్మలను మాత్రమే కత్తిరించారు. ఇది ఎవరి పని అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై బాలినేని శిబిరం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి బాలినేని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

నగరంలో ధ్వంసం చేసిన ఓ ఫ్లెక్సీ

ఏ బాధ్యతలు ఇస్తారో...

వైకాపాలో బాలినేని హవా అంతా ఇంతా కాదు. జిల్లా రాజకీయాల్లో తిరుగులేని పాత్ర పోషించారు. చివరి రెండేళ్లలో కాస్తంత ప్రభ తగ్గింది. చివరకు ఆయన పార్టీని వీడి జనసేనలో చేరనున్నారు. ఆయన చేరికను జిల్లాలో కూటమి నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బహిరంగ ప్రకటనలూ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జనసేనాని బాలినేనికి ఏ బాధ్యతలు అప్పగిస్తారనే చర్చ జోరుగా సాగుతోంది.

జడ్పీ ఉద్యోగుల బదిలీల్లో ప్రతిష్టంభన

▶ వైకాపా ఆధిపత్య ధోరణితో చిక్కులు



జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం

జడ్పీ, మండల పరిషత్‌లో 1,310 మంది ఉద్యోగులు ఉండగా.... వీరిలో 450 మందికిపైగా బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.

న్యూస్‌టుడే – ఒంగోలు గ్రామీణం

జిల్లా, మండల ప్రజా పరిషత్ ఉద్యోగుల బదిలీల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ప్రస్తుతానికి జడ్పీ యాజమాన్యం పరిధిలోని బదిలీలు ఉమ్మడి జిల్లా యూనిట్‌గానే చేపడుతున్నారు. ఈ నెల 22 నాటికే ప్రక్రియ ముగియాల్సి ఉన్నా నేటికీ పూర్తిస్థాయిలో కొలిక్కిరాలేదు. జడ్పీ పీఠం వైకాపాది కావడం... వారి అనుంగులకే ప్రాధాన్యమిచ్చి అధికార తెదేపా ఎమ్మెల్యేల సిఫార్సులను పక్కన పెట్టడంతో చిక్కుముడి నెలకొందన్న ప్రచారం జరుగుతోంది.

పీటముడి ఇలా...

నిబంధనల మేరకు బదిలీల ప్రక్రియ పూర్తయ్యాక నోట్‌ఫైల్‌పై జడ్పీ ఛైర్‌పర్సన్ సంతకం చేయాలి. ప్రస్తుత జడ్పీ పాలకవర్గం వైకాపాది కావడంతో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో పన్నెండు అసెంబ్లీ స్థానాలకు గానూ పదింటిని తెదేపా కైవసం చేసుకుంది. దర్శి, యర్రగొండపాలెంలో వైకాపా ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్ ఉన్నారు. ఈ నియోజకవర్గాల్లో వారికి అనుకూలంగా ఉన్న ఎంపీడీవోలు, ఉద్యోగుల పేర్లు సిఫార్సు చేసినట్లు సమాచారం. ఈ పరిధిలో తెదేపా బాధ్యులు గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్‌బాబులు సూచించిన జాబితాలను పక్కనపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాకు చెందిన 16 మంది ఎంపీడీవోలు రెండు రోజుల క్రితం పొరుగు జిల్లాలకు బదిలీ కాగా... వారి స్థానంలో కొత్తవారొచ్చారు. మిగిలిన వారు సైతం గత ప్రభుత్వ హయాం నుంచే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో వీరితో పాటు జడ్పీ, మండల కార్యాలయాల్లోని సిబ్బంది మార్పు కోరుతూ అధికార తెదేపాకు చెందిన ఎమ్మెల్యేలు కొన్ని సిఫార్సులు చేయగా... వాటిలో సైతం సగం మాత్రమే అనుమతించినట్లు సమాచారం.

పౌర సరఫరాల తీరే వేరు...

నిబంధనల మేరకు ఎవరైనా అయిదేళ్లకు మించి ఇతర శాఖల్లో కొనసాగేందుకు వీల్లేదు. పౌర సరఫరాల శాఖలో మాత్రం అందుకు భిన్నంగా ఎనిమిది నుంచి పదేళ్లకు పైబడి కొందరు డీటీలు, ఎఫ్‌ఐలు పనిచేస్తున్నారు. ఇప్పుడూ ఆయా పోస్టుల్లోనే కొనసాగేందుకు పైరవీలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఎఫ్ఐ, డీటీగా బాధ్యతలు నిర్వహించిన ఓ అధికారి ఒంగోలు-2 డీటీగా వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. పశ్చిమ ప్రాంతంలో ఆరేళ్లుగా డిప్యుటేషన్‌పై ఉన్న మరో డీటీ... గిద్దలూరు వెళ్లేందుకు గట్టిగా ఒత్తిడి తెస్తున్నారు. ఎనిమిదేళ్లుగా గోదాం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా కొనసాగిన మరో అధికారి ఒంగోలు పౌరసరఫరాల గిడ్డంగి డీటీగా వచ్చేందుకు పావులు కదిపారు. ఈ ఒత్తిళ్లు పెరగడంతో జిల్లాకు చెందిన ఓ ఉన్నతాధికారి ఆరా తీశారు. సిఫార్సు చేసిన నాయకులకు సర్ది చెప్పి... ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో అంతా కొత్తవారికే అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిసింది.

కలెక్టర్‌కు ఫిర్యాదు...

దీర్ఘకాలంగా జడ్పీలో విధులు నిర్వహిస్తూ సంఘాల పేరిట అక్రమాలకు పాల్పడుతున్న ఉద్యోగులను తక్షణమే బదిలీ చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్... కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. బదిలీల విషయంలో సీఈవో మాధురి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని.. తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. సంతనూతలపాడు, మార్కాపురం, పర్చూరు ఎమ్మెల్యేలు... బీఎన్ విజయకుమార్, కందుల నారాయణరెడ్డి, ఏలూరి సాంబశివరావులు సైతం... బదిలీల విషయంలో నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని ఫోన్ ద్వారా కలెక్టర్‌ను కోరారు.



వాగు ప్రవాహంలో నిలిచిపోయిన బస్సు.. బయటకు వస్తున్న ప్రయాణికులు

వరదలో చిక్కుకున్న బస్సు

▶ ప్రయాణికులకు తప్పిన ముప్పు


పశ్చిమ ప్రకాశంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి పొర్లాయి. పొదిలి - మార్కాపురం రోడ్డులోని బట్టువారిపల్లి వద్ద వాగు ప్రవాహంలో... హైదరాబాద్ నుంచి వస్తున్న కనిగిరి డిపో బస్సు చిక్కుకుంది. చప్టా కిందకు టైరు దిగి... ఇంజిన్‌లోకి నీరు వెళ్లడంతో ఆగిపోయింది. అప్పటికి సమయం బుధవారం ఉదయం నాలుగు గంటలు కావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. చరవాణి ద్వారా సమాచారం ఇవ్వడంతో పొదిలి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై వేమన, సిబ్బంది, ఆర్టీసీ అధికారులు, పరిసర గ్రామాల వారు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లోపల ఉన్న 14 మంది ప్రయాణికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వరద ఉద్ధృతి తగ్గాక జేసీబీ సాయంతో బస్సును ఒడ్డుకు చేర్చారు. వర్షం కొనసాగి ఉంటే వరద ఉద్ధృతి పెరిగి పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల వరకు ఆ మార్గంలో ఇతర వాహనాలను అనుమతించలేదు. మార్కాపురం, తర్లుపాడు మండలాల్లో పంట పొలాలు నీట మునిగి చెరువును తలపించాయి. కొనకనమిట్ల మండలం సిద్దవరం ఉత్తరపల్లె మార్గంలో చప్టా కొట్టుకుపోయింది. మార్కాపురంలో 77.6 మి.మీ., తర్లుపాడులో 61.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, పొదిలి, మార్కాపురం పట్టణం



తర్లుపాడు - మార్కాపురం రోడ్డులో చెరువును తలపిస్తున్న పొలాలు

విలువల పాఠం పార్వతమ్మ

న్యూస్‌టుడే– ఒంగోలు గ్రామీణం



మాగుంట పార్వతమ్మ... సంపన్న కుటుంబంలో జన్మించినా సేవాగుణం, మానవీయ విలువలతో ప్రజల మనసులో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. భర్త దివంగత సుబ్బరామరెడ్డి వారసురాలిగా రాజకీయ ప్రవేశం చేసి.. అభివృద్ధికి పెద్ద పీట వేశారు. ఆమె మృతి చెందారన్న వార్త జిల్లా వాసులను శోకసంద్రంలో ముంచేసింది. పలువురు ఆమె సేవలను స్మరించుకున్నారు.

భర్త మరణంతో రాజకీయాల్లోకి...

రాజకీయ దిగ్గజం బెజవాడ గోపాల్‌రెడ్డి తమ్ముడు రామిరెడ్డి ఇంట 1947 జులైలో పార్వతమ్మ జన్మించారు. నెల్లూరులో విద్యాభ్యాసం సాగించారు. మాగుంట సుబ్బరామరెడ్డి సహధర్మచారిణిగా కుటుంబ ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను సమర్థంగా పర్యవేక్షించారు. నక్సలైట్ల కాల్పుల్లో భర్త మరణం తరువాత... 1996లో ఒంగోలు పార్లమెంట్ సభ్యురాలిగా ఎంపికయ్యారు. ఆయన ప్రారంభించిన సేవా కార్యక్రమాలను కొనసాగించారు. 2004లో కావలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. తనదైన శైలిలో అభివృద్ధి పనులు చేపట్టి ప్రత్యేకత చాటారు.

సేవలతో ప్రత్యేక గుర్తింపు...

ట్రస్టు ఆధ్వర్యంలో ప్రకాశంతో పాటు నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 16 జూనియర్, మూడు డిగ్రీ కళాశాలలను సమర్థంగా నిర్వహించారు. ఒంగోలులోని పోలీసు నివాస సముదాయంలో ప్రత్యేకంగా గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటు చేశారు. పోలీసు కల్యాణ మండపం నిర్మాణానికి ఎంపీ నిధులతో పాటు సొంత నిధులు వెచ్చించారు. గుజరాత్‌ను వరదలు ముంచెత్తిన సమయంలో జిల్లా నుంచి భోజన పొట్లాల సరఫరాతో పాటు... స్వయంగా నాలుగు రోజుల పాటు అక్కడే ఉండి సేవలందించారు. కనిగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి విశేష కృషి చేశారు. తాగునీటి పథకాల నిర్వహణతో పాటు... సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా ప్రజల దాహార్తి తీర్చారు.



నెల్లూరులో పార్వతమ్మ పార్థివదేహం వద్ద అంజలి ఘటిస్తున్న మంత్రి స్వామి, పూర్ణచంద్రరావు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తదితరులు

పీటీసీ ప్రిన్సిపల్‌గా రాధిక

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు పీటీసీ ప్రిన్సిపల్‌గా జి.ఆర్.రాధిక నియమితులయ్యారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉండగా.. ఒంగోలుకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న కె.వి.శ్రీనివాసరావును రాష్ట్ర పోలీసు కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా అందులో పేర్కొన్నారు.

వైకాపా పాలనలో పాపం... పొగాకు రైతులకు శాపం

▶ సొమ్ముల స్వాహాతో రాయితీ ఎరువులు దూరం

న్యూస్‌టుడే – ఒంగోలు నగరం



గత వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో చోటుచేసుకున్న అవినీతి కుంభకోణం... ఇప్పుడు పొగాకు రైతులకు కొత్త ఇబ్బందులు తెచ్చిపెట్టింది. రాయితీ ఎరువుల కోసం బోర్డు ద్వారా చెల్లించిన మొత్తాన్ని చెల్లించకుండా స్వాహా చేయడంతో... సదరు సంస్థ ఈ ఏడాది ఎరువుల సరఫరా నిలిపేసింది. దీంతో అధిక ధరలకు బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో ఒక్కో బ్యారన్‌కు రూ.6 వేల నుంచి రూ.12 వేలు వరకు అదనపు భారం పడుతోంది.

నిధులు నొక్కేశారిలా...: సహకార సంస్థలు మధ్యవర్తులుగా ఉండి రైతులకు ఎరువులు సరఫరా చేస్తే ఐపీఎల్ సంస్థ కొంత రాయితీ ఇస్తుంది. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే బస్తాకు సుమారు రూ.100 తేడా ఉంటుంది.

పొగాకు సాగుకు పొటాషియం సల్ఫేట్, డీఏపీ ఎరువులు అవసరం. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు అయిదేళ్ల క్రితం డీసీఎంఎస్, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్యల ద్వారా రైతులకు ఐపీఎల్ ఎరువులు సరఫరా చేస్తున్నారు. వేలం కేంద్రాల్లో పొగాకు అమ్మకాలు సాగించినప్పుడే ఎరువుల ఖర్చు కింద డబ్బులు మినహాయించి మిగిలినవి చెల్లిస్తారు. ఆ మొత్తాన్ని డీసీఎంఎస్, సమాఖ్యలకు పంపితే వారు ఐపీఎల్ నుంచి ఎరువులు తీసుకుని రైతులకు సరఫరా చేస్తారు. ఈ క్రమంలో డీసీఎంఎస్ అకౌంటెంట్ ఒకరు ఆ మొత్తాన్ని కంపెనీకి జమచేయకుండా దాదాపు రూ.3.52 కోట్లు తన సొంతఖాతాకు మళ్లించాడు. నెఫ్ట్, ఆర్టీజీఎస్ ద్వారా కంపెనీకి డబ్బులు పంపే క్రమంలో ఉద్దేశపూర్వకంగా ఖాతా నంబరు తప్పుగా నమోదు చేశాడు. జమ కాకుండా తిరిగి వచ్చే నగదును తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. ఇందుకోసం ముందుగానే పాలకవర్గం అధ్యక్షురాలు, బిజినెస్ మేనేజర్ సంతకాలతో ఖాళీ చెక్కులు తీసుకున్నాడు. మొత్తం 11 విడతల్లో నిధులు మళ్లించాడు. నెలలు గడుస్తున్నా డబ్బులు జమకాకపోవడంతో కంపెనీవారు పొగాకు బోర్డుకు ఫిర్యాదు చేశారు. అధికారుల విచారణలో అసలు విషయం వెలుగు చూసింది.

తూతూమంత్రం చర్యలతో సరి...: సదరు ఉద్యోగి ఖాతా నుంచి రూ.3 కోట్లు రికవరీ చేశారు. మిగతా రూ.52 లక్షలు అతడు సొంతానికి వాడుకున్నాడు. ఈ వ్యవహారంలో పెద్ద తలకాయలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమైనా చర్యలు తీసుకోలేదు. అపట్లో పర్చూరు వైకాపా ఇన్‌ఛార్జిగా ఉన్న రావి రామనాథం సతీమణి డీసీఎంఎస్ అధ్యక్షురాలిగా ఉన్నారు. బాధ్యతారహితంగా వ్యవహరించారంటూ అధ్యక్షురాలు, బీఎంలకు నోటీసులిచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాలకవర్గాన్ని రద్దు చేశారు. తరువాత ఎన్నికలు రావడంతో విషయం మరుగున పడింది. బాధ్యుడైన ఉద్యోగి నుంచి మిగతా మొత్తం రికవరీ చేయలేదు. దీంతో కంపెనీ ఈ ఏడాది సొసైటీ ద్వారా ఎరువులు ఇచ్చేందుకు నిరాకరించింది. బోర్డు అధికారులు వేరే కంపెనీ ఎరువులు సరఫరా చేస్తామని చెప్పగా... నాణ్యత ఉండదని రైతులు అంగీకరించలేదు. నాట్లు సీజన్ మొదలు కావడంతో విధిలేని పరిస్థితుల్లో బయట కొనుగోలు చేస్తున్నారు.

మంత్రి దృష్టికి సమస్య...

రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్... వెల్లంపల్లి వేలం కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు అబ్బూరి శేషగిరిరావు తదితరులు వారి దృష్టికి సమస్య తీసుకెళ్లారు. స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేసి ఎరువులకు ఇబ్బందిలేకుండా చూడాలని కోరారు. స్పందించిన మంత్రి డీసీఎంఎస్ ఇన్‌ఛార్జిగా ఉన్న జేసీతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

వారంలోనే నెరవేరిన సీఎం హామీ

❖ శ్రీనుకు అందిన ఇంటి పట్టా




గీత కార్మికుడు అల్లుదాసు శ్రీనుకు నివేశన స్థలం పట్టాను అందజేస్తున్న వీఆర్వో ఆనోక్

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ వారంలోనే నెరవేరింది. ఈనెల 20న మద్దిరాలపాడులో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు లబ్ధిదారుల ఇంటికెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికుడు అల్లుదాసు శ్రీను మాట్లాడుతూ తనకు ఉండటానికి ఇల్లు లేదన్నారు. దీనిపై స్పందించిన సీఎం వెంటనే ఇంటి పట్టాను మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించారు. దీంతో సత్వరం స్పందించిన అధికారులు అతనికి నివేశన స్థలం కేటాయించి అందుకు సంబంధించిన ఇంటి పట్టాను బుధవారం వీఆర్వో ఆనోక్ చేతుల మీదుగా అందజేశారు.

అసైన్డ్ భూములపై జేసీ ఆరా

మద్దిపాడు, న్యూస్‌టుడే: మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం జేసీ గోపాలకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అసైన్డ్ భూముల పరిస్థితిపై ఆరా తీశారు. గత పాలకుల హయాంలో 22ఏ జాబితా నుంచి తొలగించిన భూములను రీ వెరిఫికేషన్ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. గతంలో అసైన్డ్ భూములు ఆన్‌లైన్ చేసిన వాటి వివరాలను తీసుకున్నారు.

వై.పాలెం సబ్-రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు




బోగస్ రిజిస్ట్రేషన్‌పై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

ఈనాడు కథనానికి స్పందన


యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెం సబ్-రిజిస్ట్రార్ టి. హేమలతను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ) పుష్పలత బుధవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. వై.పాలెం పట్టణంలోని ప్రైవేటు భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి దస్త్రాల్లో లేని బోగస్ నంబరు 557/3 వేసి రిజిస్ట్రేషన్ చేశారు. 2021లో జరిగిన ఈ వ్యవహారం బయటకు రావడంతో బుధవారం 'లేని భూమికి రిజిస్ట్రేషన్ చేస్తాం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై విచారించాల్సిందిగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లా రిజిస్ట్రార్ ఎ.బాలాంజనేయులును ఆదేశించారు. 'ఈనాడు'లో వచ్చింది వాస్తవమేననీ, రికార్డుల్లో లేని సర్వే నంబరు వేసి భూమి రిజిస్ట్రేషన్ చేసినట్లు కలెక్టర్‌తో పాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ప్రకాశం డీఐజీకి నివేదిక ఇచ్చారు. దీంతో ప్రస్తుతం వై.పాలెంలోనే విధులు నిర్వహిస్తున్న సబ్-రిజిస్ట్రార్ హేమలతను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కేజీబీవీల్లో సిబ్బంది నియామకానికి దరఖాస్తులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పాఠశాల విద్యాశాఖ ద్వారా నిర్వహిస్తున్న జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బందిని ఒప్పంద, అవుట్‌సోర్సింగ్ విధానంలో నియామకాలు చేపడుతున్నట్లు డీఈవో డి. సుభద్ర పేర్కొన్నారు. బోధనా సిబ్బందిని ఒప్పంద విధానంలో, బోధనేతర సిబ్బందిని అవుట్ సోర్సింగ్‌లో 2024-25 సంవత్సర కాలానికి భర్తీ చేస్తామన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో రూ.250లు రుసుం చెల్లించి దరఖాస్తు చేయాలన్నారు. గురువారం నుంచి అక్టోబర్ 10 లోపు దరఖాస్తు చేయవచ్చన్నారు. ఆఫ్‌లైన్ దరఖాస్తులు స్వీకరించేది లేదన్నారు. సబ్జెక్టు, రోస్టర్ వారీగా పోస్టుల వివరాలు, గౌరవ వేతనం, విద్యార్హతల సమాచారం వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, నిడమానూరు గ్రామస్థులు



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి విరాళం చెక్కును అందజేస్తున్న మాజీ సైనికులు

వరద బాధితులకు అండ

టంగుటూరు, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం గ్రామస్థుల నుంచి సేకరించిన రూ. 2 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుధవారం అందజేశారు. టంగుటూరు మండలం ఎం.నిడమానూరుకు చెందిన తెదేపా నాయకులు విజయవాడ వరద బాధితుల కోసం ఇంటింటికి తిరిగి నగదు సేకరించారు. ఈ నేపథ్యంలో ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య ఆధ్వర్యంలో అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కును అందజేశారు. విరాళాలు అందించిన వారిలో గ్రామ నాయకులు బోడపాటి అంజిబాబు, కాకుమాని శ్రీనివాసరావు, సుబ్బారావు, సురేష్‌బాబు, సురేష్, వాసు, మధు, నరసింహం, ఆదినారాయణ పాల్గొన్నారు.

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితులకు చేయూతనిస్తూ మాజీ సైనికులు పెద్ద మనసు చాటారు. కంభం మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి రూ. 1.30 లక్షల చెక్కును అందజేశారు. దేశం కోసం త్యాగాలు చేసిన వారు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్, కేసీహెచ్.పుల్లయ్య, ఎన్.పోలయ్య, జి.అంకయ్య, జె.బాలకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల ముంగిటకు ఉచిత పాఠాలు

❖ భౌతికశాస్త్రం బోధిస్తున్న మాధవశర్మ



పాఠాలు బోధిస్తున్న కొండూరు మాధవశర్మ

న్యూస్‌టుడే, కనిగిరి:

ప్రస్తుతం విద్య పేద వర్గాలకు భారంగా మారింది. చిన్నపాటి చదువులకూ రూ.వేలకు వేలు వెచ్చించాల్సిందే! ఇలాంటి తరుణంలో భౌతిక శాస్త్రంలాంటి కఠిన సబ్జెక్టును ఉచితంగా బోధిస్తున్నారు కనిగిరికి చెందిన ప్రధానోపాధ్యాయులు కొండూరు మాధవశర్మ.

అత్యంత పేదరిక ప్రాంతమైన కనిగిరిలో ఉచిత బోధన చేస్తూ విద్యార్థులకు దారి చూపుతున్నారు కొండూరు మాధవ శర్మ. కనిగిరి కొత్తపేటకు చెందిన ఈయన మండలంలోని లింగారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. భౌతికశాస్త్రం బోధించడంలో దిట్ట అయిన ఈయన కనిగిరి ప్రాంతంలోని రెండొందల మంది పేద విద్యార్థులకు గత కొన్నేళ్లుగా తన నివాసంలో ఉచితంగా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. అయితే దూర ప్రాంతాల్లో ఉంటున్న వారు ఆయన సేవలు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో వారికి చేయూతనిచ్చేందుకు కేఎంఎస్ యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేసి ఆరో తరగతి నుంచి పీజీ వరకు, డీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు భౌతిక శాస్త్ర పాఠ్యాంశాలు ఉచితంగా బోధిస్తున్నారు. ఈయనకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచే కాక అమెరికా, ఇంగ్లండ్, ఇండోనేషియా నుంచి ఎక్కువమంది శిష్యబృందం ఉండటం విశేషం. యాప్‌ల ద్వారా బోధిస్తే పేద వర్గాల వారికి భారమవుతుందన్న ఉద్దేశ్యంతో యూట్యూబ్‌లో ఎలాంటి రుసుము తీసుకోకుండా తరగతులు నిర్వహిస్తున్నానన్నారు. లక్షకు పైగా సబ్‌స్క్రైబర్స్ దాటడంతో అమెరికా నుంచి యూట్యూబ్ ద్వారా సిల్వర్ బటన్ అందుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని ఆయన చెప్పారు.

రుద్రభూమినీ వదలని వైకాపా నేత



ఆక్రమణకు గురైన పాతసింగరాయకొండ గిరిజన శ్మశాన వాటిక స్థలం

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

అయిదేళ్ల వైకాపా పాలనలో ఆ పార్టీ నేతలు సింగరాయకొండ మండలంలో యథేచ్ఛగా ప్రభుత్వ, ప్రైవేటు భూముల కబ్జాలకు పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా వాటిని ప్లాట్లుగా వేసి విక్రయించి జేబులు నింపుకొన్నారు. వారి అవినీతి ఆగడాలకు అప్పటి అధికారులు సైతం వంత పాడి అప్పనంగా ప్రభుత్వ భూములకు నకిలీ పత్రాలు సృష్టించి ధారాదత్తం చేశారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చకుండానే అక్రమ వెంచర్లు వేసినా ఎవరూ అడ్డుచెప్పలేదదు. అంతటితో ఆగకుండా దళితులు, గిరిజనులను బెదిరించి వారి భూముల ఆక్రమణలకు సైతం పాల్పడ్డారు.

బెదిరించి.. భయపెట్టి

పాతసింగరాయకొండ గ్రామ పరిధిలోని 105 సర్వే నంబరులో సుమారు 4.50 ఎకరాల ప్రభుత్వ భూమిని పదేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు 1,500 మంది గిరిజన కుటుంబాలకు శ్మశానవాటిక స్థలంగా కేటాయించారు. అప్పటి నుంచి స్థానిక మల్లికార్జుననగర్, బాలిరెడ్డి నగర్, పోతుల చెంచయ్య కాలనీ వాసుల్లో ఎవరైనా మరణిస్తే ఈ ప్రాంతంలోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఈ భూమి 16వ నంబరు జాతీయ రహదారికి సమీపంలో ఉన్నందున సోమరాజుపల్లి గ్రామం ఫకీర్‌పాలేనికి చెందిన చాన్‌బాషా అనే వైకాపా నేత మూడేళ్ల క్రితం నకిలీ పట్టాతో ఆక్రమించి భారీ యంత్రాలతో స్థలాన్ని చదును చేయించేశారు. సమాధులను తొలగించి పంట సాగు చేస్తుండటంతో సమాచారం తెలుసుకున్న ఆ ప్రాంత గిరిజనులు అడ్డుకున్నారు. వారిపై అధికార దర్పంతో దుర్భాషలాడి బెదిరింపులకు గురి చేశారు. అనంతరం మృతదేహాలను ఖననం చేయకుండా అడ్డుకోవడంతో గిరిజనులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మృతదేహంతో నిరసనకు సైతం దిగారు. దీంతో రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ఆ వైకాపా నేతపై అప్పటి అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అయినా నేటికీ అతడిపై చర్యలు తీసుకోలేదని ఆ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా స్థలం చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేసి గిరిజనులను శ్మశాన వాటికలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. వైకాపా నేత బారి నుంచి గిరిజనులకు రక్షణ కల్పించాలని, శ్మశాన వాటికను గిరిజనులకు చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు కమిటీ సభ్యుడు పొట్లూరి లక్ష్మయ్య కోరుతున్నారు. శ్మశాన వాటిక కబ్జాపై తహసీల్దార్ రవిని వివరణ కోరగా.. ఆక్రమణదారుడిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించి వారి ఉత్తర్వుల మేరకు చర్యలు చేపడతామని తెలిపారు.

రామతీర్థంలోకి తగ్గిన ప్రవాహం

❖ చెరువులకు సాగర్ జలాలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: సాగర్ ఒంగోలు బ్రాంచి కాలువ ద్వారా రామతీర్థం జలాశయంలోకి వచ్చి చేరుతున్న నీటి ప్రవాహం రోజు రోజుకు తగ్గుతోంది. ఎగువ ప్రాంతంలో నీటి వినియోగం పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా ఉంది. అయితే అదే సమయంలో జలాశయంలోని నీటితో చెరువుల్ని నింపుతున్నారు. ప్రస్తుతం రామతీర్థం పూర్తిస్థాయి నీటి మట్టం 85.34 మీటర్లు కాగా, ప్రస్తుతం 80.76 మీటర్లుగా ఉంది. కొద్ది రోజుల కిందట భారీ వర్షాలు కురిసినా రిజర్వాయర్ నీటిమట్టంలో ఎలాంటి పెరుగుదల కనిపించకపోవడం విశేషం. బుధవారం జలాశయంలోకి ఓబీసీ ద్వారా 190 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. అదే సమయంలో దిగువకు 290 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం దిగువ భాగంలో ఉన్న పలు చెరువులను ఈ నీటితో నింపుతున్నారు. తద్వారా పరివాహక ప్రాంతంలోని జనావాసాల్లో నీటి కష్టాలు దూరం కానున్నాయి.



రామతీర్థం జలాశయం

దీపావళికి గ్యాస్ సిలిండర్లు అందిస్తాం

❖ ఇది మంచి ప్రభుత్వంలో మంత్రి స్వామి



మాట్లాడుతున్న మంత్రి వీరాంజనేయ స్వామి, చిత్రంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వీరాంజనేయ స్వామి అన్నారు. బుధవారం కొండపి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే జిల్లాలో రూ.143 కోట్లతో పనులు చేశామన్నారు. ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. దీపావళికి ఆడపడుచులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ 'ఇది మంచి ప్రభుత్వం'లో భాగంగా ఇంటింటికి వెళ్లి ఈ వంద రోజుల్లో చేపట్టిన కార్యక్రమాలు వివరిస్తున్నట్లు చెప్పారు. వచ్చే వంద రోజుల్లో ఏం చేయాలో తమకు ముఖ్యమంత్రి నిర్దేశించారన్నారు. అంతకుముందు మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా కొండపిలోని సీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్యులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం సచివాలయం వద్ద రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇంటింటికి తిరిగి 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను అతికించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాస ప్రసాద్, ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి, తహసీల్దార్ మురళి తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

ఎట్టకేలకు నాయనమ్మ చెంతకు పిల్లలు



పిల్లలను అప్పగిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు గ్రామీణం: 2023 నవంబర్ నెలలో బాపట్ల జిల్లాకు చెందిన ఇద్దరు పిల్లలు తప్పిపోయారు. వారికి తల్లిదండ్రులు కూడా లేకపోవడంతో ఒంగోలులోని బాలసదన్‌లో ఉంచారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాలు, పత్రికా ప్రకటనల ద్వారా ప్రయత్నించినా వారి బంధువుల ఆచూకీ కూడా దొరకలేదు. ఇటీవల బాపట్ల జిల్లా ఈపురుపాలెం, స్టూవర్టుపురం ప్రాంతాలకు తీసుకెళ్లి వారి బంధువులను గుర్తించే ప్రక్రియలో వారం రోజులపాటు అక్కడ తిప్పారు. చివరకు స్టూవర్టుపురంలో వారి నాయనమ్మతోపాటు, బంధువులను పిల్లలు గుర్తించారు. ఈ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సమక్షంలో స్థానిక కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో బుధవారం వారిని నాయనమ్మ, బంధువులకు అప్పగించారు. పిల్లలకు తల్లిదండ్రులు లేకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బాపట్లలోని బాలసదన్‌లో ఉంచి విద్యను అందించాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి దినేష్‌కుమార్, బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ పాల్గొన్నారు.

డీసీఏఓపై దాడి కేసులో నిందితుల పట్టివేత

ఒంగోలు, నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా సహకార శాఖ ఆడిట్ ఆఫీసర్ (డీసీఏఓ) పోలిశెట్టి రాజశేఖర్‌పై దాడికేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ నెల 11వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆయన్ను కర్రలతో విచక్షణారహితంగా కొట్టి గాయపరిచారు. ఈ కేసులో సీసీ ఫుటేజీ ఆధారంగా ఆరుగురు యువకులను పోలీసులు పట్టుకుని విచారిస్తున్నారు. ఈ సందర్భంగా కొన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. జిల్లాలోని కొన్ని పీఏసీఎస్‌లలో జరిగిన అక్రమాలపై రాజశేఖర్ చేసిన విచారణలు, కొన్ని వ్యక్తిగత అంశాల నేపథ్యంలో నిందితులు దాడికి దిగారని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

హామీల అమలు కోరుతూ ధర్నా



కలెక్టరేట్ వద్ద కంచాలు మోగిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుల

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ అమలు చేయడంలో విఫలమైనట్లు డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా పేర్కొన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిద్రలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని లేపేందుకే నిరసన చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం, పార్టీ నాయకులు రంగస్వామి, పి.కొండారెడ్డి, సుబ్బారెడ్డి, విజేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్లేట్లు మోగిస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు.

వృద్ధురాలిని బెదిరించి రూ.లక్ష దోపిడీ



బాధితురాలు పొన్నం సీతారావమ్మ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలులో మంగళవారం అర్ధరాత్రి నలుగురు దుండగులు వృద్ధురాలిని బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. రూ.లక్ష నగదుతో పాటు చెవికమ్మలు లాక్కెళ్లారు. ఒంగోలు రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కాకతీయ నగర్ రెండో లైన్‌లో పొన్నం సీతారావమ్మ (80) ఒంటరిగా నివసిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గుర్తు తెలియని నలుగురు యువకులు ఇంటిలోకి ప్రవేశించి నిద్రలో ఉన్న సీతారావమ్మపై ముసుగు వేసి బెదిరింపులకు పాల్పడ్డారు. బీరువాలో ఉన్న రూ.లక్ష నగదుతో పాటు ఆమె చెవి కమ్మలను తీసుకుని పరారయ్యారు. బుధవారం ఉదయం కుమార్తెకు సమాచారమివ్వగా, ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, రెండో పట్టణ సీఐ మేడా శ్రీనివాసరావు సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకున్నారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ బృందాలను రంగంలోకి దింపి ఆధారాలు సేకరించారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి గుర్తింపు

ఒంగోలు నేరవిభాగం: ఒంగోలు రైల్వేస్టేషన్ సమీపంలో ఈ నెల 23న గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై ఒంగోలు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు యువకుడు త్రోవగుంటకు చెందిన కొట్టు భాను ప్రకాష్(22)గా గుర్తించినట్లు రైల్వే ఎస్సై అరుణకుమారి తెలిపారు. కుమారుడి మృతిపై అతని తల్లి సుభాషిణి అనుమానం వ్యక్తం చేశారు. తమ గ్రామంలోనే ఓ యువతిని భానుప్రకాష్ ప్రేమించడంతో ఆమె బంధువులు గతంలో అతనిపై దాడి చేశారన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న భానుప్రకాష్ ఇంటికి వచ్చిన రెండురోజులకే మృతి చెందాడని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని ఆమె పోలీసులను కోరారు.

మతిస్థిమితం లేని విద్యార్థి ...

కనిగిరి: మతి స్థిమితం లేని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కనిగిరి మున్సిపాలిటీలోని మాచవరంలో బుధవారం రాత్రి జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కనిగిరి పట్టణానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి (13) మాచవరంలోని అమ్మమ్మ వద్దకు వెళ్లాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆ బాలుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

తర్లుపాడు : మతిస్థిమితం లేని యువకుడిని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటన కలుజువ్వలపాడు ఎస్సీ కాలనీ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగసముద్రం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువకుడు బుధవారం రాత్రి ఒంగోలు నుంచి మార్కాపురం వస్తున్న ఆర్టీసీ బస్సుకు అడ్డుగా రావడంతో అతన్ని ఢీకొంది. తీవ్ర గాయాలు కావడంతో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు మార్కాపురం డిపోదిగా గుర్తించారు.

చీరాల మహిళగా అనుమానం ?

తాళ్లూరు, దొనకొండ: దొనకొండ మండలం గంగదేవిపల్లి సమీపాన మల్లెల వాగు కాజ్‌వే వద్ద వారం రోజుల క్రితం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని దొనకొండ పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. అయితే ఆ మహిళ ఎవరన్నది తెలియరాలేదు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టగా, బాపట్ల జిల్లా చీరాల ప్రాంతానికి చెందిన మహిళ అయి ఉండొచ్చన్న కోణంలో అక్కడి పోలీసులు కూడా వచ్చి విచారిస్తున్నట్లు తెలిసింది.

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

మేమున్నాం.. మీకు తోడుగా.. మార్కాపురం : 8008631313 గిద్దలూరు పట్టణం: 8008574135 యర్రగొండపాలెం: 8008552658 పొదిలి: 8008550360

బేస్తవారపేట, న్యూస్‌టుడే:

సమస్య: బేస్తవారపేట పంచాయతీలోని స్థానిక ఇంజినీరింగ్ కార్యాలయం సమీపంలోని రహదారి పక్కన మురుగునీటి కాలువపై ఏర్పాటు చేసిన చప్టా ఇరువైపులా పగిలిపోయి పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయగలరు.
– శ్రీనివాసులు, స్థానికుడు

సమాధానం: రెండు రోజుల్లో చప్టాకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.
– నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి

కంభం, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని తురిమెళ్ల పశువైద్యశాల లోపలి భాగంలోని ద్వారా బంధనాలు చెదలు తిని పాడైపోయాయి. విద్యుత్తు బోర్డులు సైతం పాడైపోయాయి. మరమ్మతులు చేయించాలి.
హరి, స్థానికుడు

సమాధానం : పాడైపోయిన పశువైద్యశాల భవనాలను బాగు చేయించేందుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.
– బాలునాయక్, ఏడీ, పశువైద్యశాఖ, కంభం



అర్ధవీడు: గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, నాయకులు


పెద్దారవీడు: కరపత్రం అందజేస్తున్న తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, నేతలు

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

అర్ధవీడు, పెద్దారవీడు, పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని యాచవరంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ప్రజల మన్ననలు పొందామని.. సంక్షేమంతో పాటు..ప్రజా ప్రయోజనాలకై తోడ్పాటు అందిస్తున్నట్లు ఆయన సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు యాదవ్, మాజీ అధ్యక్షులు బోయపాటి వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచి వీరయ్య నాయకులు పాల్గొన్నారు. ● ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సుపరిపాలన అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టులోని ముంపు గ్రామమైన సుంకేసులలో ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు ప్రజల తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే వెలిగొండ నిర్వాసితులకు పరిహారం అందించి న్యాయం జరిగేలా చూస్తామని భరోసా కల్పించారు. చెంచు గిరిజన గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దారు శైలేంద్రకుమార్, డీటీ రాజేష్, సర్పంచి రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ● పెద్దదోర్నాల మండలం చిన్నగుడిపాడులో తెదేపా నేతలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

‘తితిదేను అప్రతిష్ఠ పాలుజేసిన వైకాపా’

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలపడం నిరసనగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మండల జనసేన నేతలు త్రిపురాంతకంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ఎస్సీ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తితిదేను అప్రతిష్ఠ పాలు చేసేందుకు గత వైకాపా ప్రభుత్వం పనిగట్టుకుని ఈ దుశ్చర్యకు పాల్పడిందన్నారు. ● **బేస్తవారపేట:** గిద్దలూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి బెల్లంకొండ సాయిబాబు జన్మదిన వేడుకలను జనసేన జిల్లా కార్యదర్శి లంకా నరసింహారావు ఆధ్వర్యంలో బేస్తవారపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేకు కోసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన, భాజపా నేతలు పాల్గొన్నారు.


త్రిపురాంతకంలో ప్రదర్శన నిర్వహిస్తున్న జనసేన నేతలు

‘ప్రతి పైసాకు లెక్కలున్నాయి’

మార్కాపురం పట్టణం: పట్టణంలోని ప్రముఖ శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంకు సంబంధించి నూతన గాలిగోపురాలు, రంగనాయక మండపం, ఆంజనేస్వామిగుడి, భేరిమండపం నిర్మాణాల కోసం భక్తుల వద్ద నుంచి సేకరించిన ప్రతి పైసాకు లెక్క, రసీదులు ఉన్నాయని ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ పి.కేశవరావు స్పష్టం చేశారు. విరాళాలపై ఇటీవల కొందరు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో బుధవారం ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మొత్తం నిర్మాణాల కోసం రూ.11కోట్లు దాతల నుంచి విరాళాలు సేకరించామన్నారు.

29న వ్యాసరచన పోటీలు

మార్కాపురం పట్టణం: గాంధీ జయంతిని పురస్కరించుకొని అవోపా ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదిన స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు మండలాల పరిధిలోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.


బేస్తవారపేట మండలం పొగుళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

పోషకాహారం.. పప్పు లోపం

● మూడు నెలలుగా నిలిచిన సరఫరా ● అవస్థలు పడుతున్న లబ్ధిదారులు

బేస్తవారపేట, న్యూస్‌టుడే:

ఐసీడీఎస్ అధికారులు ఓ వైపు జిల్లావ్యాప్తంగా పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. పౌష్టికాహారంతోనే ఆరోగ్యమని అవగాహన కల్పిస్తున్నారు. కానీ అంగన్‌వాడీల్లో సమతుల ఆహారం లభిస్తుందా అంటే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైకాపా ప్రభుత్వం హయాం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిన కందిపప్పు సరఫరా ఇప్పటికీ పునరుద్ధరించలేదు. ఫలితంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఏం పెట్టాలో అర్థం కావడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో కార్యకర్తలే సొంత డబ్బులు వేసుకుని కందిపప్పును బయట కొనుగోలు చేసి వండి పెడుతున్న పరిస్థితి నెలకొంది.

మెనూలో కీలకం..

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార మెనూలో కందిపప్పు కీలకం. అందులో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అందువల్లే రోజూ ఏదో ఒక కూరగాయతో కలిపి పప్పు చేయాలి. గర్భిణులు, బాలింతలంతా కేంద్రాలకు వచ్చి భోజనాలు చేయాల్సిందేనని, ఇళ్లకు రేషన్ ఇచ్చేందుకు వీలు లేదంటూ గతంలో వైకాపా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను అమలు చేసేందుకు నిర్వాహకులు అవస్థలు పడ్డారు. అదే సమయంలో కందిపప్పు సరఫరా సవ్యంగా లేకపోవడంతో ఏం వండి పెట్టాలో తెలియక నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కేంద్రాల్లో భోజనం పథకం రద్దు చేసి ఇంటింటికీ రేషన్ విధానం తీసుకొచ్చారు.

■ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పేరు: బేస్తవారపేట	
■ మండలాలు: బేస్తవారపేట, కంభం, అర్ధవీడు	
■ సెక్టార్లు: 08	■ అంగన్‌వాడీ కేంద్రాలు: 199
■ చిన్నారులు (ఏడు నెలల నుంచి మూడేళ్లు): 3,761	
■ చిన్నారులు (మూడేళ్ల నుంచి ఆరేళ్లు): 2,633	
■ గర్భిణులు: 707	■ బాలింతలు: 719

బియ్యం, నూనెతో సరి..

గర్భిణులు, బాలింతలకు రోజుకు 125 గ్రాముల బియ్యం, 30 గ్రాముల కందిపప్పు, 16 గ్రాముల చొప్పున నూనె అందించాల్సి ఉంది. 3-5 ఏళ్ల చిన్నారులకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, 5 గ్రాములు నూనెతో వంట చేసి కేంద్రంలోనే అందించాలి. గత మూడు నెలలుగా కందిపప్పు సరఫరా లేకపోవడంతో వంట చేసేందుకు నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల కూడా సరఫరా అయ్యే పరిస్థితి లేదంటున్నారు. గుత్తేదారులకు బిల్లులు చెల్లింపు లేకపోవడంతో నిలిచిపోయినట్లు చెబుతున్నారు. దీంతో సమతుల ఆహారం అందించాలని ప్రభుత్వాల లక్ష్యం నీరుగారిపోతోంది.

సరఫరా చేసేందుకు చర్యలు..

గత మూడు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా లేదు. ఈ నెలలో సరఫరా చేసేలా అవసరమైన నివేదికలు ఉన్నతాధికారులకు ఇచ్చాం. ఇటీవల సరఫరా చేసేందుకు గుత్తేదారు ముందుకు రావడంతో కందిపప్పు ప్యాకింగ్ పనులు పూర్తయ్యాయి. రెండు రోజుల్లో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.
– షేక్ నీలోఫర్ బేగం ఐసీడీఎస్ సూపర్‌వైజర్, బేస్తవారపేట.

‘పొలం పిలుస్తోంది’తో రైతులకు ప్రయోజనం

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే: పొలం పిలుస్తోంది కార్యక్రమంతో రైతులకు మేలు కలుగుతుందని ఎంపీపీ కాసింబీ పేర్కొన్నారు. రాచర్ల మండలం గుడిమెట్ట, సోమిదేవిపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అధికారులు, నాయకులు పలు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి అబ్దుల్ రఫీక్ మాట్లాడుతూ.. కంది పంట కళ్లె దశలో ఉందని, దానికి శనగ పచ్చ పురుగు ఆశించే అవకాశం ఉందని చెప్పారు. వేప నూనె మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. ● త్రిపురాంతకం మండలం జి.ఉమ్మడివరం, కంకణాలపల్లిలో బుధవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ● బేస్తవారపేట మండలంలోని మోక్షగుండంలో అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ విధానంపై అవగాహన కల్పించారు. ● పెద్దదోర్నాల మండలం చిన్నగుడిపాడు, పెద్దబొమ్మలాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.


రాచర్ల : కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పోటీ పరీక్షలతో విజ్ఞానం పెరుగుతుంది

కంభం, మార్కాపురం, కొమరోలు గ్రామీణం,: పోటీ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని ఎంఈవో మాల్యాద్రి అన్నారు. కంభంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్సు చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయి పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. మండలంలోని 14 పాఠశాలలకు సంబంధించిన 2,220 విద్యార్థులు ప్రతిభ పరీక్ష రాశారు. సంఘం మండల అధ్యక్షుడు నారపరెడ్డి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వరికుంట్ల వెంకటేశ్వర్లు, షేక్ నాయబ్‌రసూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.● మార్కాపురం పట్టణంలో జడ్పీబాలికల, అరవింద, నారాయణ టెక్నో, కమలా, సాయిబాలాజీ, వాసవి, సాయి చైతన్య తదితర పాఠశాలల్లో చెకుముకి సంబరాలు నిర్వహించారు. సుమారు 1,000 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ●కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెకుముకి ప్రతిభా పరీక్షను నిర్వహించారు.


మార్కాపురం: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


పొదిలి– గిద్దలూరు రహదారిపై నిలిచిన వర్షపు నీరు


మార్కాపురం: గుండ్లకమ్మనదిలో ఉధృతంగా ప్రవాహం


కొనకనమిట్ల: సిద్ధవరంలో కోతకు గురైన చప్టా

పేదరిక నిర్మూలనే లక్ష్యం

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మార్కాపురం డివిజనల్ పంచాయతీ అధికారి వై.భాగ్యవతి తెలిపారు. రాచర్ల మండలం కాలువపల్లి గ్రామంలో బుధవారం స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సూచనలు, సలహాల స్వీకరణ కోసం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2047 నాటికి పేదరిక నిర్మూలన, మౌలిక వసతుల కల్పన, జల్‌జీవన్ మిషన్, ఎల్ఈడీ దీపాల ఏర్పాటు, హరిత ఇంధనం, స్కిల్ సెన్సస్, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగాలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెరువు సర్వే 60 శాతం పూర్తి

మార్కాపురం: మార్కాపురంలోని పట్టణ నడిబొడ్డున ఉన్న పెద్దచెరువులో ఉన్న ఆక్రమణల లెక్కలను అధికారులు తేలుస్తున్నారు. గత వారం రోజులుగా మార్కాపురం మండల సర్వేయరు సురేష్‌తో పాటు మార్కాపురం మండలంలో ఉన్న పలువురు గ్రామ సర్వేయర్లు చెరువును సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు చెరువును 60 శాతం మేర పూర్తి చేశారు. పూర్తి స్థాయిలో సర్వే చేయాల్సి ఉందని తహసీల్దారు చిరంజీవి తెలిపారు

మట్కా నిర్వాహకుల అరెస్ట్

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు నగర పంచాయతీలోని ఓ హోటల్ సమీపంలో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరి గిద్దలూరు పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.8వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

కురిసిన వర్షం.. మునిగిన పంట

మార్కాపురం, మార్కాపురం పట్టణం, పొదిలి, కొనకొనమిట్ల, న్యూస్‌టుడే: మార్కాపురం నియోజకవర్గంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి జోరుగా వాన కురిసింది. దీంతో మార్కాపురం, పొదిలి, తర్లుపాడు, కొనకొనమిట్ల మండలాల్లో పంట పొలాలన్నీ నీటమునిగి తటాకాలను తలపించాయి. వాగులు, వంకలు పొంగాయి. పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపడానికి రైతులు అవస్థలు పడ్డారు. మార్కాపురంలో అర్ధరాత్రి నుంచి ఉదయం తెల్లవారుజాము వరకు 77.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. తర్లుపాడు 61.4మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మార్కాపురంలోని గుండ్లకమ్మనది ఉద్ధృతంగా ప్రవహించింది. కొనకనమిట్ల మండలంలోని సిద్ధవరం ఉత్తరపల్లె వెళ్లే రహదారి చప్టా పూర్తి కొట్టుకుపోయింది. పొదిలిలో వర్షానికి పలుప్రాంతాలు జలమయమయ్యాయి. పొదిలి-గిద్దలూరు రహదారిపై ఇండేన్ గ్యాస్ కార్యాలయం ముందు భారీగా వర్షపునీరు నిలిచింది. రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదాచారులు ఇబ్బంది పడ్డారు. బట్టువారిపల్లి వాగు పొంగిడంతో బుధవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సువాగులో ఇరుక్కుపోయింది.


మార్కాపురం పట్టణం: సీతానాగులవరంలో నేలకొరిగిన జొన్నపంట

అర్హులందరికీ ఇళ్లు

రాచర్ల: అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి అన్నారు.

అగ్నిమాపక కేంద్రానికి స్థలం పరిశీలన

పొదిలి: పొదిలిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు బుధవారం జేసీ గోపాలకృష్ణ స్థలాన్ని పరిశీలించారు. కంబాలపాడు గ్రామ సర్వేనెం.172/1 లో ఉన్న రూ.1.50 ఎకరాల విస్తీర్ణం చూశారు. ప్రధాన రహదారికి అతి సమీపంలో ఉండటంతో అనువైన ప్రాంతంగా గుర్తించారు. గతంలోనే పొదిలికి అగ్నిమాపక కేంద్రం మంజూరైనా స్థలం చూపించకపోవడంతో ఇప్పటివరకు కేంద్రం ఏర్పాటు కాలేదు. కార్యక్రమంలో ఆయన వెంట కనిగిరి ఆర్డీవో జాన్ ఇర్విన్, పొదిలి తహసీల్దార్ ఎం.వి.కృష్ణారెడ్డి, అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ, అధికారులు

ఎస్పీ బాలుకి నివాళి

పొదిలి: గాన గంధర్వుడు దివంగత ఎస్పీ బాలసుబ్రమణ్యం వర్ధంతిని పొదిలిలో చిన్ననాటి స్నేహితుల ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించారు. పాతూరులో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలు చిత్రపటం వద్ద వారు పుష్పాంజలి ఘటించారు.

వైద్య శిబిరం: కంభం: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు ఇస్మాయిల్ విద్యార్థులకు పరీక్షలు చేశారు. రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

గ్రంథాలయాల తనిఖీ

గిద్దలూరు పట్టణం, కంభం, రాచర్ల, బేస్తవారపేట: గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి సిబ్బందికి సూచించారు. గిద్దలూరు, రాచర్ల, కంభం, బేస్తవారపేటలోని గ్రంథాలయాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులను పాఠకులుగా మార్చుకొనేలా అవగాహన కల్పించాలని కోరారు. సెస్ బకాయిలు వసూలు చేయాలని సూచించారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య తన సొంత నిధులతో జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు చెందిన 10మంది విద్యార్థులకు సభ్యత్వం నమోదు చేయించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.


కంభం: విద్యార్థులతో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, పేరయ్య

దుకాణాల యజమానులపై 6ఏ కేసు నమోదు

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీకృష్ణ ట్రేడర్స్, చీతిరాల నాగేశ్వరరావు దుకాణాల్లో జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమ సిబ్బందిని రైతుల మాదిరిగా పంపి యూరియా కొనుగోలు చేశారు. వారి వద్ద ఆయా దుకాణ యజమానులు యూరియా బస్తాను రూ.266.50పైసలకు విక్రయించాల్సి ఉండగా రూ.350 వసూలు చేశారు. వెంటనే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీసీటీవో బి.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా దుకాణాలపై దాడులు నిర్వహించారు. కృష్ణ ట్రేడర్స్‌లో ఉన్న 387, చీతిరాల నాగేశ్వరరావు దుకాణంలో ఉన్న 160 యూరియా బస్తాలను సీజ్ చేశారు. అనంతరం ఆయా ఎరువుల దుకాణ యజమానులపై 6ఏ కేసు నమోదు చేశారు. గిద్దలూరు మండల వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

పొలం మేపు కొనే విషయంలో ఘర్షణ

యర్రగొండపాలెం పట్టణం: జీవాలు మేపు కొనే పొలం విషయంలో చెలరేగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గుర్రప్పశాలకు చెందిన కాయకాకుల రాజయ్య తన గొర్రెలు మేపుకొనేందుకు ఓ రైతుతో పొలం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే పొలం తనకు ఆ రైతు జీవాలను మేపు కొనేందుకు అనుమతి ఇచ్చారని ఈ నెల 24న గ్రామానికే చెందిన పిట్టమల్ల ఎల్లయ్య, అతని తండ్రి బోడెయ్యలు రాజయ్యపై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చౌడయ్య తెలిపారు.

అసంపూర్తిగా నాడు- నేడు పనులు

కంభం, న్యూస్‌టుడే :

గత వైకాపా ప్రభుత్వం హయాంలో నాడు-నేడు పథకం కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ. 90 లక్షలతో నాడు -నేడు పనులు చేయాలని సంకల్పించారు. వాటిల్లో రూ. 43 లక్షలతో పనులు చేశారు. మిగతా బిల్లులు సక్రమంగా మంజూరు కాక గుత్తేదారుడు చేతులెత్తేశారు. దీంతో పనులు నిలిచిపోయాయి.

గ్రీన్‌చాక్‌బోర్డులు ఏర్పాటు ఎప్పుడో..

కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఒకేషనల్ గ్రూపులు ఉన్నాయి. వాటిల్లో సుమారు 300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నాడు- నేడు పనుల్లో భాగంగా గ్రీన్ చాక్ బోర్డులు వచ్చాయి. వాటిని బిగించేందుకు గుత్తేదారు సిబ్బంది రాకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. స్మార్ట్ టీవీలు వచ్చాయి. వాటినే అధ్యాపకులే ఏర్పాటు చేయించుకున్నారు. వాటికి అంతర్జాలం సౌకర్యం కల్పించకపోవడంతో వారి చరవాణుల్లోనే వైఫై ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. కొత్తగా బాలురు, బాలికలకు మరుగుదొడ్లు నిర్మించారు. బయటి తలుపులను సొంతనిధులు ఖర్చుచేసి అధ్యాపకులు బిగించారు. లోపలి తలుపు మాత్రం ఏర్పాటు చేయలేదు. మరుగుదొడ్లు, కళాశాల భవనాలకు రంగులు వేయలేదు. అసంపూర్తిగా పనులు నిలిచి ఉండడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తి చేసేందుకు గుత్తేదారు ముందుకురావడం లేదని అధ్యాపకులు చెబుతున్నారు. పలు కాలేజీల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.


రంగులు వేయకపోవడంతో తుప్పుపడుతున్న కిటికీల తలుపులు

కురిచేడు, న్యూస్‌టుడే:

సమస్య : కాటంవారిపల్లె సమీపంలో రైల్వే గేటు నంబర్ 250 వద్ద గల అండర్‌పాస్ బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి బురదమయమైంది. దీంతో ఆ మార్గం గుండా వెళ్లే వాహనాలు అందులో కూరుకుపోతున్నాయి.
- మేడగం రోశిరెడ్డి, స్థానికుడు

సమాధానం: అండర్‌పాస్‌ను వెంటనే పరిశీలిస్తాం. బురద తొలగించి, ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.
- సాయిరాం, రైల్వే ఐవోడబ్ల్యూ, దొనకొండ

పీసీపల్లి, న్యూస్‌టుడే:

సమస్య: జంగాలపల్లి, చినవరిమడుగు, మురుగమ్మి, వెదుర్లపాడు వైపు గ్రామాల ప్రజలు మండల కేంద్రం పీసీపల్లికి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే రహదారి కొద్దిపాటి వర్షాలకే బురదమయం అవుతుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. రోడ్డును అభివృద్ధి చేయగలరు. -స్థానికులు

సమాధానం: సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా అధికారులకు పంపించాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం.
-చెంచిబాషా, పంచాయతీ కార్యదర్శి, పీసీపల్లి

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి

దర్శి, న్యూస్‌టుడే: ఇంటింటి సర్వేలో ఓటర్ల జాబితాపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపడుతున్నట్లు దర్శి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లోకేశ్వరరావు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 29వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురణ జరుగుతుందని, నవంబర్ 28 వరకు వచ్చే ఫిర్యాదులను విచారించి, జనవరి 6, 2025న తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు.

కొత్త చెరువు నీరు వృథా

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముద్రం జువ్వల వాగు సమీపంలోని కొత్త చెరువు కట్ట కింద దిగువ రంధ్రం పడి నీరు వృథాగా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై వారు జలవనరుల శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆ శాఖ డీఈ సాదిక్‌బాషా, ఏఈ రవి చెరువుకట్ట వద్దకు చేరుకుని పరిశీలించారు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు.

అడుగుకో గుంత.. ఎన్నాళ్లీ చింత!

అభివృద్ధి, సంక్షేమం.. కూటమి ప్రభుత్వ లక్ష్యం

మర్రిపూడి, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా తెదేపా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. మండలంలోని అయ్యపురాజుపాలెంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రూ.10 కోట్లతో మూడు వసతి గృహాలను మంజూరు చేశామన్నారు. వైకాపా పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అపవిత్రం చేశారని ఆరోపించారు. వచ్చే నెల నుంచి గ్రామ సభలు నిర్వహించి నూతన పింఛన్ల దరఖాస్తులు స్వీకరించి, అనర్హులను తొలగిస్తామన్నారు. గ్రామంలో రూ.40 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సంగమేశ్వర ప్రాజెక్టును ప్రాధాన్యతా క్రమంలో చేపడతామన్నారు. సర్పంచి కావ్య గ్రామంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ సమస్యలపై గ్రామస్థులు ఇచ్చిన వినతులు స్వీకరించారు. అధికారులు బాధ్యతా రాహిత్యం ఉన్నారని, సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని సూచించారు. ▸ కొండెపి గ్రామీణం: ముసి వాగుకు సాగర్ నీరు విడుదల చేయాలని మంత్రి బాలవీరాంజనేయ స్వామికి వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ▸ పామూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దూబగుంట గ్రామంలో బుధవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సచివాలయంలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ సక్రమంగా విధులు నిర్వహించడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ▸ హనుమంతునిపాడు: మండలంలోని వాలిచెర్లలో వెంకటరెడ్డి రూ.6 లక్షల వ్యయంతో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన మంచినీటి ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించారు. గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో మొక్కలు నాటారు. ▸ తాళ్లూరు: దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి తాళ్లూరులో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వంద రోజుల పాలనలో చేసిన అభివృద్ధి పత్రాలను పంపిణీ చేశారు.


అయ్యపురాజుపాలెం సభలో మాట్లాడుతున్న మంత్రి బాలవీరాంజనేయస్వామి


తాళ్లూరులో మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న నాయకులు

వాహనం.. ఒళ్లూ గుల్లవుతున్నాయి..



రహదారి మరీ దారుణ స్థితిలో ఉంది. చెప్పలేని విధంగా గోతులమయమైంది. ప్రతి రెండురోజులకొకసారి ఇటువైపు రాకపోకలు సాగిస్తుంటాను. రోడ్డు బాగులేని కారణంగా దీనిపై ద్విచక్రవాహనంతో వెళ్తే ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మంచి రోడ్లపై ఎంత దూరం ప్రయాణించినా ఇబ్బందులు రావడం లేదు. ఇటువైపుగా ప్రయాణిస్తే మాత్రం అలసటకు గురికావాల్సిందే. వాహనం కూడా సజావుగా వెళ్లే పరిస్థితి లేదు.
–నన్నూరి వెంకటేశ్వర్లు, రైతు, కొర్రపాటివారిపాలెం

● వర్షాలతో మరింత అధ్వానంగా తాళ్లూరు-తూర్పుగంగవరం రోడ్డు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తాళ్లూరు-తూర్పుగంగవరం ర.భ.శాఖ రహదారి మరింత అధ్వానంగా మారిందని, తక్షణమే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. నిత్యం ఇలా తిరిగే ఆటోలు, ద్విచక్రవాహనాలు గుల్లవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపెద్ద గుంతల్లో నీళ్లు నిలిచిపోవడంతో లోతు తెలియక వాహనాలు అదుపు తప్పుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గత అయిదేళ్ల నుంచి ఈ దారిలో రాకపోకలు సాగించేందుకు నరకం అనుభవిస్తున్నామని, ఇకనైనా పనులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ ఎస్ఈ దేవదానాన్ని వివరణ కోరగా.. గుత్తేదారుడితో చర్చించామని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. - న్యూస్‌టుడే, తాళ్లూరు


తూర్పుగంగవరం రామాలయం సమీపంలో రహదారిపై ఏర్పడిన భారీ గుంతలో నిలిచిన వర్షపునీరు

మెలికలు తిరగాల్సిందే..



నేను తాళ్లూరులోని ఓ గ్యాస్ ఏజెన్సీలో కంప్యూటర్ ఆపరేటరుగా పనిచేస్తున్నా. నిత్యం ఉదయం, సాయంత్రం ఇటువైపుగా రాకపోకలు సాగిస్తుంటాను. రోడ్డంతా గోతులమయమైంది. వాహనాలు సక్రమంగా వెళ్లే పరిస్థితి లేదు. మెలికలు తిప్పుతూ జాగ్రత్తగా నడపాల్సి వస్తుంది. రహదారి బాగు లేని కారణంగానే వాహనం తరచూ మరమ్మతులకు గురవుతోంది. నెలకు రూ.రెండు నుంచి మూడువేల వరకు ద్విచక్ర వాహనం మరమ్మతులకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి.
–కురిచేటి శ్రీను, ప్రైవేటు ఉద్యోగి, తూర్పుగంగవరం

ఎంతమందికి చెప్పినా ఫలితం లేదు..



ఈ రహదారిపై పెద్ద గోతులేర్పడి అధ్వానంగా ఉన్నా పట్టించుకున్న నాథుడే లేరు. వైకాపా పాలనలో ఎన్నడూ కనీస మరమ్మతులు చేయని కారణంగా ఇబ్బందులు తీవ్రతరమయ్యాయి. నిత్యం నాలుగుసార్లు ఈ రోడ్డులో ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నా. ఈ రోడ్డుని బాగు చేయించాలని ఎంతమందిని కోరినా.. ఎవరూ స్పందించలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ప్రస్తుత అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేయాలి.
–షేక్ చిన కాలేషావలి (బాబు), డెయిరీ నిర్వాహకుడు, రమణాలవారిపాలెం

మరమ్మతులకు రూ.వేల ఖర్చు..



తూర్పుగంగవరం నుంచి తురకపాలేనికి ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్నా. నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు పదిసార్లు ఈ రోడ్డులో ఆటోను నడుపుతున్నాను. రోడ్డంతా గుంతలమయం అయినందున ఎంత జాగ్రత్తగా తీసుకెళ్లినా అదుపుతప్పుతుందేమోనని భయం వెంటాడుతోంది. రహదారి దుస్థితివల్ల వాహనం పాడైపోతోంది. ప్రతి నెలా మరమ్మతులకే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.
–బి.ఏడుకొండలు, ఆటో చోదకుడు, తురకపాలెం

ఇసుక ఇవ్వాలని నిరసన

కనిగిరి, న్యూస్‌టుడే: ఇసుక కొరత లేకుండా చూడాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని నాజ్ సెంటర్‌లో బుధవారం భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు కేశవరావు మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రాల్లో ఇసుక పాయింట్లు ఏర్పాటు చేసి సరఫరా చేయాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.

పాత రుణాలు చెల్లిస్తేనే కొత్తవి వస్తాయి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘాలకు ఎన్‌సీడీసీ పథకం కింద రూ.11 కోట్ల రుణాలను ఇచ్చారని, వాటిని పొందిన వారు వెంటనే చెల్లించాలని జిల్లా గొర్రెల, మేకల పెంపకందార్ల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి, సహాయ సంచాలకులు డాక్టర్ సీహెచ్.వెంకట్రామిరెడ్డి కోరారు. సి.ఎస్.పురం పశువైద్యశాలలో రుణ బకాయిల వసూలుపై వారు బుధవారం సమావేశం నిర్వహించారు. వీటిని చెల్లిస్తేనే తిరిగి పెంపకందార్లుకు రాయితీ రుణాలు మంజూరవుతాయన్నారు.

సామాజిక ఆసుపత్రి అభివృద్ధికి విరాళాలు

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని కమ్యూనిటీ వైద్యశాల అభివృద్ధికి స్థానిక తెదేపా నాయకులు టి.శ్రీనివాసులరెడ్డి, ఫిరోజ్, అంజయ్య, రమణారెడ్డి, నారాయణ, తిరిపాలు, అహ్మద్, రామసుబ్బారెడ్డి, హజరత్‌రెడ్డి, బాలయ్య, నాగార్జున అంజిరెడ్డిలు కలిసి రూ.1.25 లక్షల నగదును ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి బుధవారం అందజేశారు. పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ముక్కు తిరుపతిరెడ్డి, మూలె రమణారెడ్డి, ఎస్‌వీ.కొండారెడ్డి, రూ.40 వేలు విరాళాన్ని ఎమ్మెల్యేకు ఆయన నివాసంలో అందజేశారు.


ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి నగదు అందజేస్తున్న తెదేపా నాయకులు

సాగు పద్ధతులపై అవగాహన

న్యూస్‌టుడే, బృందం: కనిగిరి, కొండపి, దర్శి నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం కూడా వ్యవసాయాధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని, తెగుళ్ల నివారణ పద్ధతులను వివరించారు. పంట నమోదు చేయించుకుంటేనే అన్ని రాయితీలు, పథకాలు వస్తాయన్నారు. కొండపి మండలంలోని చిన్నకండ్లగుంట, తాటాకుపాలెంల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు హాజరయ్యారు. డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేసే విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమాల్లో కనిగిరి ఏడీఏ ఎగ్గోని వెంకటరమణ, ఆయా మండలాల ఏవోలు, ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


కొండపి: డ్రోన్ వినియోగంపై వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

హడావుడి చేసి.. అసంపూర్తిగా వదిలేసి

న్యూస్‌టుడే, దర్శి

వైకాపా అయిదేళ్ల పాలనలో దర్శి నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి జాడేలేదు. దీంతో ఎన్నికల్లో పరాభవం తప్పదని భావించిన నాటి పాలకులు ప్రజలకు తాము ఏదో చేస్తున్నట్లు ఎన్నికల ముందు హడావుడి చేశారు. పోనీ పూర్తి చేశారంటే అదీ లేదు. దర్శిలో చేపట్టిన రైతు బజార్ నిర్మాణమే ఇందుకు నిదర్శనం. సంవత్సరం క్రితం రైతు బజార్ నిర్మించేందుకు సంకల్పించిన వైకాపా ప్రభుత్వం దానిని పూర్తి చేయడంలో మాత్రం చిత్తశుద్ధి చూపించలేకపోయింది. ఫలితంగా ఇప్పుడు మొండి గోడలతోనే నిర్మాణం దర్శనమిస్తోంది.

చేసిన పనులకు బిల్లులు రాక..

ఆకు కూరలు, కూరగాయలు పండించే రైతులు నేరుగా విక్రయించేందుకు దర్శిలో రైతు బజారు నిర్మాణ పనులను సంవత్సరం క్రితం నాటి పాలకులు శ్రీకారం చుట్టారు. స్థానిక కురిచేడు రోడ్డులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం పక్కనున్న స్థలంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రూ.80 లక్షల నిధులు విడుదల చేసింది. రూ.63 లక్షలకు టెండర్లు పిలవగా ఓ వైకాపా నాయకుడు పనులు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడిగా పనులు చేసి, నాసిరకం మెటీరియల్ వినియోగించారు. దుకాణాల గోడలు వరకు నిర్మాణం చేపట్టి, స్లాబ్, రేకుల కప్పు వేయడం నిలిపారు. జరిగిన పనులు కూడా నాసిరకంగా ఉండటంతో పునాదుల్లోనే నెర్రెలిచ్చాయి. అప్పటి వరకు జరిగిన రూ.25 లక్షల పనులకు అధికారులు ప్రభుత్వానికి బిల్లులు పంపించారు. నిధుల కొరతతో అప్పటి వైకాపా ప్రభుత్వం బిల్లులు విడుదల చేయలేదు. దీంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీనిపై ఏఎంసీ కార్యదర్శి పద్మశేఖర్‌ను వివరణ కోరగా. . నూతన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారమే ఇతర పనులు చేపడతామని తెలిపారు.


దర్శిలో నిలిచిపోయిన రైతు బజారు నిర్మాణం

నకిలీ వైద్యం.. పొంచి ఉన్న ప్రాణాపాయం

- రెండేళ్ల క్రితం సింగరాయకొండ–కందుకూరు రోడ్డు కూడలి సమీపంలోని ఫిజియో థెరపి క్లినిక్ నిర్వాహకుడు చిన్న పిల్లలకు సైతం వైద్యం చేస్తానని చెప్పి ఎనిమిదేళ్ల బాలుడికి జ్వరం వస్తే అధిక మోతాదులో మందులు ఇవ్వడంతో వైద్యం వికటించి ఈ చిన్నారి మృత్యువాత పడ్డాడు. దీనిపై అప్పట్లో పోలీసు కేసు కూడా నమోదు కావడంతో క్లినిక్‌ను అధికారులు సీజ్ చేశారు.
- రెండు నెలల క్రితం సింగరాయకొండ జీవీఆర్ రోడ్డులోని ఒక రక్త పరీక్ష కేంద్రం నిర్వాహకుడు జ్వరంతో బాధపడుతున్న నాలుగేళ్ల బాలుడికి వైద్యం అందించగా, అది వికటించి ఆ చిన్నారి మృతి చెందాడు. అయితే బాధిత తల్లిదండ్రులకు ఎంతోకొంత నగదు ఇచ్చి విషయం బయటకు రాకుండా చూసుకున్నారు.

- న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

మండల కేంద్రం సింగరాయకొండలో అనుమతులులేని క్లినిక్‌లు, మందుల దుకాణాలు, రక్త పరీక్ష కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇలాంటి సుమారు 20 వరకు ఉన్నాయంటే నకిలీ వైద్యం ఏ మేరకు పెచ్చుమీరుతుందో అర్థం చేసుకోవచ్చు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులు వారి పాలిట కాసుల వర్షం కురిపిస్తున్నాయి. గత అయిదేళ్లుగా ఎలాంటి అర్హత లేకున్నా ప్రభుత్వ అనుమతులు లేని క్లినిక్‌లు నిర్వహిస్తూ కొందరు నకిలీ వైద్యులు ప్రజలను దోపిడీ చేస్తున్నారు. సాధారణ జ్వరాలను సైతం డెంగీ, టైఫాయిడ్, మలేరియా తదితర విష జ్వరాల పేరుతో బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తూ నిలువునా దోచుకుంటున్నారు. మరికొందరు అనుమతులు లేని రక్త పరీక్షా కేంద్రాలు నిర్వహిస్తూ వ్యాధి నిర్ధారణ పేరుతో పరీక్షలు నిర్వహిస్తూ వారే వైద్యం అందిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత వైద్యాధికారులు నామమాత్రపు తనిఖీలతోనే సరిపెడుతున్నారని మండలవాసులు పోతున్నారు. దీనిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వాణిశ్రీని వివరణ కోరగా.. సింగరాయకొండలో నకిలీ క్లినిక్‌లు, అనుమతులు లేని రక్త పరీక్ష కేంద్రాలు, మందుల దుకాణాలను పరిశీలించి నిర్వాహకులపై చర్యలు చేపడతామన్నారు.


సింగరాయకొండలోని ఓ క్లినిక్‌లో తనిఖీలు చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వాణిశ్రీ తదితరులు(పాతచిత్రం)

తపాలా బీమా పథకాలపై అవగాహన

టంగుటూరు: తపాలా శాఖ పథకాలను ఉపయోగించుకోవాలని ఒంగోలు సౌత్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కారుమంచిలో బుధవారం గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్ఐ), తపాలా జీవిత బీమా (పీఎల్ఐ), పోస్టాఫీసు పొదుపు ఖాతాలపై అవగాహన కల్పించారు. ఇటీవల మరణించిన వ్యక్తి కుటుంబానికి ఆర్‌పీఎల్ఐ పథకం నగదును అందించారు.

చౌక బియ్యం పట్టివేత

కురిచేడు, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరు నుంచి ఆవులమంద మీదుగా పల్నాడు జిల్లాలోని వినుకొండకు తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని బుధవారం రాత్రి ఆవులమంద సమీపంలో అడ్డగించి స్థానిక వీఆర్వో ఖాసింకు అప్పగించినట్టు గ్రామస్థులు తెలిపారు. వాహనంలో పది బస్తాల చౌక బియ్యం ఉన్నట్లు వారు గుర్తించారు.

● **జూదరులు అరెస్ట్ :** కనిగిరి: మున్సిపాలిటీలోని మాచవరం బీసీ కాలనీ సమీపంలో జూదం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీరామ్ బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.24,950 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

● **మద్యం సీసాల స్వాధీనం: టంగుటూరు:** జరుగుమల్లి మండలం వావిలేటిపాడుకు చెందిన సంజీవరావును 8 క్వార్టర్ మద్యం సీసాలతో, పాలేటిపాడుకు చెందిన కోటేశ్వరరావును 9 క్వార్టర్ మద్యం సీసాలతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: బాలబాలికలు క్రీడా పోటీల్లో పాల్గొంటే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందుతుందని మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసులు అన్నారు. సింగరాయకొండ ప్రభుత్వ బాలుర పాఠశాలలో బుధవారం కొండపి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌ను పాఠశాలల కోఆర్డినేటర్ అశోక్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పరుగుపందెంలో పాల్గొన్న బాలికలు

'మన ఇల్లు..మన గౌరవం'పై సమీక్ష

దర్శి, న్యూస్‌టుడే: నగరపంచాయతీ, మండల పరిధిలోని 20 లేఅవుట్లు, సొంత స్థలంలో నిర్మించుకున్న గృహాలను 2025 మార్చి 31 లోపు పూర్తి చేయాలని మెప్మా పీడీ రవికుమార్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో 'మన ఇల్లు..మన గౌరవం' కార్యక్రమంపై బుధవారం అవగాహన కల్పించారు. ఎంపీడీవో కుసుమకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

ముండ్లమూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని జేసీ గోపాలక్రిష్ణ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి దస్త్రాలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలను పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను గుర్తించి ఆక్రమణలకు గురి కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు శాఖ ప్రారంభం

దర్శి: స్థానిక కురిచేడు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన శాఖను బుధవారం జిల్లా సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ ప్రారంభించారు. మేనేజర్ గదిని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, స్ట్రాంగ్ రూమ్‌ను డీఎస్పీ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కిరణ్‌రెడ్డి, తహసీల్దార్ శ్రావణకుమార్, నగర పంచాయతీ ఛైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేష్, ఇతరులు పాల్గొన్నారు.

స్వాగత వేడుక.. ఆనంద గీతిక

పామూరు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్‌వీ జూనియర్, ఈటీఎన్ఎల్ డిగ్రీ కళాశాలల ప్రథమ సంవత్సరం విద్యార్థుల స్వాగత వేడుక బుధవారం సందడిగా సాగింది. క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని వక్తలు సూచించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అలరించాయి. వారి కేరింతలతో ఆ ప్రాంతం మార్మోగింది. కార్యక్రమంలో డైరెక్టర్ యేలూరి నరేన్ చౌదరి, సీఐ ఎం.భీమానాయక్, ఎంఈవో జి.కరుణకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పేరుకే అర్బన్.. సమస్యలతో అధ్వానం

న్యూస్‌టుడే, కనిగిరి

పేరు	కుటుంబాలు	జనాభా
అర్బన్ కాలనీ	300	1,100 మంది

అది పేరుకే అర్బన్, వాస్తవంగా గ్రామం. కనిగిరి పట్టణానికి అనుకునే ఉన్నా.. సమస్యలు మాత్రం వీడడం లేదు. అధ్వానంగా ఉన్న రోడ్లు, ఇళ్ల సమీపం, రహదారుల పక్కన దట్టంగా పెరిగిన చిల్లచెట్లు, ప్రమాదకరంగా దర్శనమిస్తున్న విద్యుత్తు స్తంభాలు.. వెలగని వీధి దీపాలు, నీళ్లు రాని బోర్లు, అన్నింటికంటే కానరాని పారిశుద్ధ్య నిర్వహణ.. ఇదీ కనిగిరి మండలం చాకిరాల పంచాయతీలోని అర్బన్ కాలనీ పరిస్థితి.

కానరాని మౌలిక వసతులు..

అర్బన్ కాలనీలో 300 వరకు కుటుంబాలు 1100 మంది వరకు జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ మౌలిక వసతులు కానరావడం లేదు. పేరుకు కనిగిరి పట్టణానికి దగ్గరలోనే ఉన్నా అభివృద్ధి చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఏ వీధిలో చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. గుంతలమయమైన మట్టి రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థ సరిగా లేక నీరు సాఫీగా పారడం లేదు. ఇళ్ల మధ్య చిల్లచెట్లు పెరిగి స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తాగునీరు అందడం గగనమే. ట్యాంకర్లు రాక.. బోర్లలో నీళ్లు లేక నిత్యం మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కొన్ని చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. మరి కొన్ని చోట్ల రాత్రి, పగలు వెలుగుతున్నాయి. విద్యుత్తు స్తంభాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కొన్ని కూలే స్థితిలో ఉన్నాయి. అధికారులు స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయించాలని, సీసీ రోడ్లు, నీటి సరఫరా, చిల్ల చెట్లు తొలగింపు, విద్యుత్తు తదితర సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో హనుమంతరావును వివరణ కోరగా పంచాయతీ నిధులతో సీసీ రోడ్లు వేయిస్తామన్నారు. చిల్లచెట్లు తొలగించి ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని తెలిపారు.


రోడ్డు పక్కన పెరిగిన చిల్లచెట్లు, ఒరిగి ఉన్న విద్యుత్తు స్తంభం

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

వరద బాధితులకు ఆర్ఎంపీల ఆర్థిక సాయం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు బుధవారం ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం రూ.25,116లు సమీకరించి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి చెక్కు అందజేశారు. దానిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు పి. వెంకటేశ్వర్లు, కార్యదర్శి కృష్ణారావు, కోశాధికారి జానా శ్రీనివాసు, గౌరవాధ్యక్షులు జి.భాస్కర్‌రావు, రాజగోపాల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జనార్దన్‌కు చెక్కు అందజేస్తున్న గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు

పశువైద్యశాల అదనపు గదులు ప్రారంభం : ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు సంతపేటలోని జిల్లా పశువైద్యశాల ఆవరణలో ప్రాంతీయ పశు ఆరోగ్య నిర్ధారణ కేంద్రం అదనపు గదులను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థకశాఖ అధికారిణి బేబీరాణి, డీడీ రమేష్ బాబు, ఏడీలు నాగార్జునబాబు, చంద్రమోహన్, వైద్యాధికారులు హమ్మత్రీ, అనిల్, ఏ. భరత్ పాల్గొన్నారు.

ఔటర్ రింగ్‌రోడ్డుపై వినతి : ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలో ట్రాఫిక్ సమస్య నివారణకు పేర్నమిట్ట పెళ్లూరు మధ్య ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మించాలని కోరుతూ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొల్లా మధు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు వినతి పత్రం సమర్పించారు.

సంక్షేమమే లక్ష్యంగా వంద రోజుల పాలన

మద్దిపాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలో బసవన్నపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు ఉపయోగపడే ఎన్నో మంచి పనులు చేసిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ మండవ రంగారావు, తహసీల్దార్ సుజన్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో ఆంజనేయులు, సర్పంచి రావి అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



బసవన్నపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎన్

● చీమకుర్తి, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రభుత్వం వారి అభివృద్ధికి బాటలు వేస్తోందని చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై. రామకృష్ణయ్య పేర్కొన్నారు. చీమకుర్తి పురపాలక సంఘం పరిధిలోని రామ్‌నగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ వైస్ ఛైర్మన్ గంగాధరరావులు, పట్టణ తెదేపా అధ్యక్షుడు సుబ్బారావు, జి.చెన్నయ్య, రత్నాకర్, బాలకాశమ్మ, పి. చంద్ర, ఎస్. ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉప కేంద్రం ప్రారంభం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం రామతీర్థం వద్ద నూతనంగా నిర్మాణం చేసిన విద్యుత్తు ఉపకేంద్రం ఎట్టకేలకు గురువారం ప్రారంభానికి సిద్ధమైంది. ఆర్.ఎల్.పురం పంచాయతీ పరిధిలోని రామతీర్థం కూడలి సమీపంలో గ్రానైట్ ఫ్యాక్టరీ సమీపంలో నిర్మాణం చేపట్టారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే గ్రానైట్, అనుబంధ పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా కానుంది.

శివయ్యకు ప్రత్యేక పూజలు

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని ప్రముఖ శైవ క్షేత్రాలలో శివునికి పంచామృతాలతో బుధవారం అభిషేకాలు నిర్వహించారు. కేశవస్వామిపేటలోని కాశీ విశ్వనాథుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గ్రానైట్ వ్యర్థాలతో పూడ్చిన గుంతలు



గ్రోత్ సెంటర్ ప్రవేశ ద్వారం ముందు నిల్వ ఉన్న మురుగునీరు



రోడ్డు మధ్యలో పెరిగిన చిల్ల చెట్లు

అధ్వాన రోడ్లు.. ప్రయాణికుల పాట్లు

ఒంగోలు ఈనాడు

గత వైకాపా ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో రహదారుల మరమ్మతులను గాలికొదిలేసింది. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు నుంచి కనపర్తికి వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తోంది. ఒక ద్విచక్రవాహనం వెళ్లే దారి మాత్రమే ఉంది. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో ఉన్న ఎంఎస్ఎంఈలు స్థానికంగా ఉన్న ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. నిత్యం ఆయా దారుల్లో వేలాది మంది ప్రజలు, భారీ వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. అలాంటి ప్రతిష్ఠాత్మక రోడ్డు అయిదేళ్లుగా నిర్వహణ లేక గుంతలమయంగా మారి, రాళ్లు లేచి ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. భారీ వాహనాలు అటువైపు ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని గుంతల్లో గ్రానైట్ వ్యర్థాలు వేయడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయాలపాలవుతున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌లో చిల్ల చెట్లు పెరిగి రహదారికి అడ్డంగా వస్తున్నా కనీసం పట్టించుకున్న నాథుడే లేడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అమ్మనబ్రోలు – కనపర్తికి వెళ్లే రోడ్డు పరిస్థితి

ఘనంగా ఫార్మసిస్టుల దినోత్సవం



కేకు కోస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ దుర్గాదేవి, వైద్యాధికారులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: స్థానిక సర్వజన ఆసుపత్రిలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి పాల్గొని ఫార్మసిస్టుల సమక్షంలో కేక్ కోసి పంచారు. అనంతరం వైద్యరంగంలో ఫార్మాసిస్టుల ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో వి. చెంచయ్య, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ ఎల్. వెంకటేశ్వర్లు, క్విస్ కళాశాల ఆచార్యులు దివ్యశ్రీ, ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు జె. రవికిరణ్, ప్రధాన కార్యదర్శి కె. రత్నాకర్‌బాబు, కోశాధికారి వెంకట్రావు, విజయభాస్కర్, రాష్ట్ర నాయకులు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జడ్పీ పాలకవర్గానికి మూడేళ్లు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్‌గా బూచేపల్లి వెంకాయమ్మ, జడ్పీటీసీ సభ్యులు బాధ్యతలు చేపట్టి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక దక్షిణ బైపాస్‌లోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం కేకు కోశారు. వెంకాయమ్మకు జడ్పీ ఉప సీఈవో సీహెచ్. హనుమంతరావు, జడ్పీటీసీ సభ్యులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అర్హులందరికీ ఓటుహక్కు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జనవరి ఒకటో తేది 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి, అందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఒంగోలు ఆర్డీవో జీవీ.సుబ్బారెడ్డి సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. సమావేశంలో ఒంగోలు, కొత్తపట్నం తహసీల్దార్లు వాసు, మధుసూదనరావు పాల్గొన్నారు.

భూ పరీక్షల ఆధారంగానే ఎరువుల వినియోగం

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ప్రతి రైతు తాను సాగు చేసే భూమిని ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి భూసార పరీక్షల చేయించి వాటి ఫలితాల ఆధారంగానే రసాయన సేంద్రియ ఎరువులు వాడాలని ఏవో వెంకట్రావు అన్నారు. బుధవారం మండలంలోని చదలవాడ, చీర్వానుప్పలపాడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల వారిచే పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● పేర్నమిట్ట(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: రైతులు వ్యవసాయశాఖాధికారుల సూచనలు, సలహాలతో సాగు ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించాలని డివిజన్ సహాయ సంచాలకులు బి.రమేష్‌బాబు పేర్కొన్నారు. పేర్నమిట్టలోని శాంతీనగర్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో పి. పావని, పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, ఏఈవో సుబ్బారెడ్డి, ఏపీజీ బ్యాంకు అధికారి ఆర్. వి. సుబ్బారావు, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో అధిక దిగుబడి : చీమకుర్తి, న్యూస్‌టుడే: పచ్చిరొట్ట పైర్లను పూత దశలో దున్నడం వల్ల అందులో ఉండే నత్రజని పోషకాలు ప్రధాన పంటలకు ఎంతో ఉపయోగ పడతాయని చీమకుర్తి మండల వ్యవసాయాధికారి డి. వి. భాస్కర్ తెలిపారు. మండలంలోని మంచికలపాడు, పి. నాయుడుపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.



మిరప పంటను పరిశీలిస్తున్న డివిజన్ సహాయ సంచాలకులు రమేష్‌బాబు

పొలం పిలుస్తుంది : మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గుండ్లాపల్లి, అన్నంగి గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖాధికారి రమేష్ బాబు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లతీఫ్, ఏఈవో శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోగల పాఠశాలల్లో గురువారం నుంచి ఈ నెల 30 వరకు వీరగాథ ప్రాజెక్టు 4.0 లో భాగంగా అన్ని తరగతుల వారికి వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో డి. సుభద్ర తెలిపారు. 3-5, 6-8, 9-10, 11-12 తరగతులకు నాలుగు కేటగిరీల్లో పద్యాలు, డ్రాయింగ్, పెయింటింగ్, మల్టీమీడియా వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎంఈవోలు, ఉప విద్యాశాఖ అధికారులు వారి పరిధిలోని హెచ్ఎంలకు తగు సూచనలు చేసి పోటీలు నిర్వహించేలా చూడాలన్నారు.

చేనేత, జౌళి శాఖ ఏడీకు సన్మానం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: బదిలీపై గుంటూరు వెళ్తున్న చేనేత, జౌళిశాఖ ఏడీ బి.ఉదయకుమార్‌ను బుధవారం స్థానిక ప్రకాశం భవన్‌లో సన్మానించారు. 2020 సెప్టెంబర్ నుంచి చేనేత, జౌళిశాఖ ఏడీగా కొనసాగుతున్నారు. కార్యక్రమంలో చేనేత శాఖ ఆర్డీడీ వి.భీమయ్య, డీవో వెంకటేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మెలకువలతో ఆక్వా సాగులో లాభాలు

ఒంగోలు నగరం: ఆక్వా సాగులో తగిన మెలకువలు పాటిస్తే నికర ఆదాయం పొందవచ్చని ఫ్రాన్స్ దేశ శాస్త్రవేత్త స్టీఫెన్‌రాలిట్ సూచించారు. బుధవారం అవంతి ఫీడ్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎస్ కళ్యాణమండపంలో ఆక్వా రైతులు, డీలర్ల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. రీజనల్ మేనేజర్ గోపాలకృష్ణ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వివిధ దేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. వియత్నాం శాస్త్రవేత్త లాక్ట్రాన్స్ రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు.



చీమకుర్తిలో ప్రదర్శన నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు

ఇంటింటా తపాలా సేవలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: అన్ని వర్గాలవారూ తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలని ప్రకాశం డివిజన్ సీనియర్ పర్యవేక్షకులు ఎం.డి.జాఫర్ సిద్దికి తెలిపారు. బుధవారం ఒంగోలు పశ్చిమ మండల పర్యవేక్షకులు పి.జే.ప్రవీణ్ రాజ్‌తో కలిసి ఆయన చీమకుర్తి తపాలా కార్యాలయాన్ని సందర్శించారు. తపాలా సేవలు, 'ఇంటింటా పొదుపు పంట' కార్యక్రమం గురించి అవగాహన కల్పిస్తూ ఉద్యోగులు, సిబ్బంది పట్టణ ప్రధాన రహదారిలో ప్రదర్శన చేపట్టారు. పోస్టు మాస్టర్ కాలేరావు, మస్తాన్ వలి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలినేని అవినీతిని పవన్ తెలుసుకోవాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సంతమాగులూరు, బల్లికురవ మండలాల్లోని అటవీ భూములను మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అటవీశాఖ మంత్రిగా ఉన్న సమయంలో తన కుటుంబానికి ధారాదత్తం చేశారని తెదేపా నాయకుడు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక గుంటూరురోడ్డులోని తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలినేని అవినీతి గురించి పవన్‌కల్యాణ్ కూడా తెలుసుకోవాలని కోరారు.

తెలుగు యువత నిరసన : మాజీ మంత్రి బాలినేనిని జనసేనలో ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేర్చుకోవద్దని ఒంగోలు పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం తెలుగు యువత ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. తొలుత కలెక్టరేట్ ఎదుట బాలినేనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

శాస్త్రీయ భావనలతో విద్యాభ్యాసం

చీమకుర్తి, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్న నాటి నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకొని, మూఢనమ్మకాల పట్ల ప్రజలను చైతన్యవంతం చేస్తూ శాస్త్రీయ భావనలు పెంపొందింప చేసుకోవాలని చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు కోరారు. చీమకుర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరగిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక చెకుముకి ప్రతిభ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తులను వెలికి తీసేలా జేవీవీ ఆధ్వర్యంలో ప్రతిఏడాది చెకుముకి ప్రతిభ పరీక్ష నిర్వహించడం అభినందనీయం అన్నారు. మండల విద్యాశాఖాధికారులు నరసింహారావు, శివాజీ, డాక్టర్ బి.జవహర్, వీరాస్వామి, చలువాది రమేష్, బి.ఆంజనేయులు, ఎం.సుబ్బారావు, డి. సుబ్బారావు, ఎ.వీరారెడ్డి, నాగకుమార శర్మ పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ పోటీలు : సంతనూతలపాడు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకే చెకుముకి పోటీలను నిర్వహిస్తున్నట్లు జేవీవీ గౌరవాధ్యక్షులు కోదాటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో చెకుముకి పాఠశాల స్థాయి పోటీలకు సంబంధించి ప్రశ్నా పత్రాలను విడుదల చేసి పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నల్లూరి ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు సుబ్బారావు, రజని, రాధ, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తి: ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐ సుబ్బారావు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఆయుర్వేద వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఉప సంచాలకులు, సంతనూతలపాడు ఆయుర్వేద వైద్యాధికారి ఎ.కరుణాకర్ రావు కోరారు. చీమకుర్తి మండలం కె.వి.పాలెంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు కరుణాకర్ రావు, ఆర్.శకుంతల వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచి బి.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం. శ్యామ్ కుమార్, స్థానిక నాయకులు గోరంట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు పక్కాగృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ జి.అర్చన సూచించారు. బుధవారం పక్కాగృహాల నిర్మాణ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల, సచివాలయ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ మధుసూదనరావు, ఈవోఆర్డీ బాలచెన్నయ్య, డీఈ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ జి.అర్చన

కమిషనర్ బాధ్యతల స్వీకరణ



చీమకుర్తి, న్యూస్‌టుడే: అందరి సహకారంతో చీమకుర్తి పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన వై.రామకృష్ణయ్య తెలిపారు. ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు. కమిషనర్ మాట్లాడుతూ చీమకుర్తి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067 ఒంగోలు గ్రామీణం : 8008564455

ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766

ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే:

సమస్య: నగరంలోని కొత్తపట్నం వైపు వెళ్లే రైల్వే వంతెన, కొప్పోలు వరకు డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన స్తంభాలకు విద్యుత్తు దీపాలు వెలగడంలేదు. ఈ మార్గంలో రోడ్డు సరిగా కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. దీపాలు వెలిగేలా చూడగలరు. – మిండాల నాగరాజు, స్థానికుడు.

సమాధానం: కొత్త విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేస్తాం.

– బాలాజీ సూపర్‌వైజర్

వ్యర్థాలు శుభ్రం చేయించారు

స్పందనకు వందనం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని సుజాత నగర్ 1, 2, 3, లైన్లలో కాలువల నుంచి తీసిన వ్యర్థాలను రోడ్లపైనే వదిలేస్తున్నారు. అనే అంశంపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో ఈ నెల 24న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అక్కడ సిబ్బందితో తీసిన వ్యర్థాలను శుభ్రం చేయించారు.

పోషకాహారంతో.. అమ్మలకు ఆరోగ్యం

● ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

ఒంగోలు గ్రామీణం, కొత్తపట్నం, న్యూస్‌టుడే:

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో చాలా మందికి పోషకాహారం సరిగా అందడం లేదు. ఫలితంగా అనారోగ్యం, రక్తహీనతతో బాధపడుతున్నారు. అలాంటి సమస్యలను అధిగమించేందుకు ఐసీడీఎస్ అధికారులు పోషకాహార మాసోత్సవం పేరుతో ఈ నెల మొత్తం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒంగోలు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఒంగోలు నగరం, గ్రామీణం, కొత్తపట్నం మండలాలు ఉండగా వాటి పరిధిలో 274 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల ద్వారా ఐసీడీఎస్ సిబ్బంది గర్భిణులు బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. పోషకాహార లోపంతో వచ్చే నష్టాలను వివరిస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అనంతరం పోషకాహారంపై అవగాహన కలిగేలా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్నారు.

ఒంగోలు ప్రాజెక్టులోని కేంద్రాలు	: 274
గర్భిణులు	: 1,701
బాలింతలు	: 1,489
మూడేళ్లలోపు చిన్నారులు	: 10,923
3-6 ఏళ్ల మధ్య పిల్లలు	: 6,052



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఐడీసీఎస్ పర్యవేక్షకులు

అవగాహన తప్పనిసరి...

పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి చైతన్యపరిచే బాధ్యతను ఐసీడీఎస్ పర్యవేక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అప్పగించారు. చిన్నారుల్లో వయస్సుకు తగిన ఎత్తు, బరువు లేనివారిని, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత ఉన్నవారిని గుర్తించి వారి వివరాలు కనిపిస్తే పోషకాహార లోపంతో ఉన్నట్లు నమోదు చేసుకుంటున్నారు.

● ఆకుకూరలు, కోడిగుడ్లు, పాలు వంటివి తీసుకోవడం మానసికంగా, శారీరకంగా ఎలాంటి ఎదుగుదల ఉంటుందో బొమ్మల సాయంతో వివరిస్తున్నారు.

● చిన్నారుల్లో ఆహారం ఒకేసారి కాకుండా ఎక్కువ సార్లు తక్కువ మొత్తంలో ఇవ్వడం వల్ల వారిలో తినే అలవాటు పెరుగుతుంది.

● వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి

గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకుంటేనే మానసిక, శారీరక పెరుగుదల ఉంటుంది. పైగా పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి. సెప్టెంబర్ నెల అంతా ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఇళ్ల వద్ద అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

– ఫణి రాజకుమారి, సీడీపీవో, ఒంగోలు ప్రాజెక్ట్